క్లుప్తంగా

రాష్ట్రస్థాయి బాడీబిల్డింగ్ పోటీల్లో అల్లూరువాసి సత్తా



అల్లూరు: అల్లూరుకు చెందిన పందల ప్రేమ్‌సాగర్ రాష్ట్రస్థాయి బాడీబిల్డింగ్ పోటీల్లో సత్తా చాటాడు. ఆదివారం రాత్రి కావలిలో జరిగిన మిస్టర్ సింహపురి స్టీల్‌మెన్ బాడీబిల్డింగ్ చాంపియన్‌షిప్–2025 రాష్ట్రస్థాయి పోటీల్లో నాల్గో స్థానంలో నిలిచాడు. ఈ సందర్భంగా ప్రేమ్‌సాగర్‌ను మండల ప్రజలు అభినందించారు.

ఆర్‌ఐ బాధ్యతల స్వీకరణ

కొండాపురం : మండల నూతన ఆర్‌ఐగా అనుదీప్ సోమవారం బాధ్యతలు స్వీకరించాడు. ఆయన జలదంకి రెవెన్యూ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ ప్రమోషన్‌పై ఇక్కడికి వచ్చారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న ఆర్‌ఐ సాధారణ బదిలీల్లో భాగంగా సంగం మండలానికి వెళ్లారు.

సొసైటీలో యూరియా పంపిణీ



సంగం : స్థానిక సహకార సంఘంలో రైతులకు యూరియా పంపిణీని సొసైటీ అధ్యక్షులు గుండ్లపల్లి శ్రీనివాసులుయాదవ్, ఏఓ శ్రీధర్ సోమవారం ప్రారంభించారు. ఏఓ మాట్లాడుతూ ఎకరాకు ఒక బస్తా చొప్పున యూరియాను రైతులకు అందజేస్తున్నామని తెలిపారు. రైతుసేవా కేంద్రాల్లో సైతం యూరియా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సొసైటీ సీఈఓ దస్తగిరి,రైతులు పాల్గొన్నారు.

డీసీపల్లిలో 761 పొగాకు బేళ్ల విక్రయం

మర్రిపాడు: డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో సోమవారం 761 బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 976 బేళ్లు రాగా, 761 బేళ్లను విక్రయించామని చెప్పారు. వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ.280, కనిష్టంగా రూ.160, సగటున రూ.222.15 ధర పలికిందని తెలిపారు.

కలిగిరిలో 312 పొగాకు బేళ్ల విక్రయం

కలిగిరి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో సోమవారం 312 బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు. వేలానికి జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 387 బేళ్లను తీసుకురాగా, 312 బేళ్లను విక్రయించామని చెప్పారు. వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ. 280, కనిష్టంగా రూ.160, సరాసరిన రూ.252.15 ధర పలికిందని వివరించారు. .

మాజీ ఎంపీటీసీ మృతికి సంతాపం

ఏఎస్‌పేట(ఆత్మకూరు): ఏఎస్‌పేట మండల మాజీ ఎంపీటీసీ షేక్ మస్తాన్‌బీ (50) ఆదివారం అర్ధరాత్రి మృతి చెందారు. నూర్‌బాష్ సంఘ నాయకుడు డాక్టర్ షేక్ మౌలాలి సతీమణి అయిన మస్తాన్‌బీ మృతికి మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్యనాయుడు, స్థానిక పెద్దలు, తదితరులు సంతాపం తెలిపారు.

ఎస్సై బాధ్యతల స్వీకరణ



అల్లూరు: అల్లూరు పోలీసు స్టేషన్‌లో ఎస్సైగా ఏ శ్రీనివాసరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. వీఆర్‌లో ఉన్న ఆయన సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న కిషోర్‌బాబు వీఆర్‌కు వెళ్లారు. నూతన ఎస్సై మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు.

శ్యామాప్రసాద్ ముఖర్జీకి నివాళి



ఆత్మకూరు: నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు

ఆత్మకూరురూరల్/ఉదయగిరి/దుత్తలూరు: భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని పురస్కరించుకుని ఆత్మకూరులోని మున్సిపల్ బస్టాండ్ వద్ద ఆయన చిత్రపటానికి బీజేపీ నాయకులు సోమవారం ఘనంగా నివాళులర్పించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుడుముల సుధాకర్‌రెడ్డి, ఆత్మకూరు పట్టణాధ్యక్షుడు నున్నా సంతోష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.అలాగే ఉదయగిరిలోని బీజేపీ కార్యాలయంలో బీజేపీ మండలాధ్యక్షురాలు పీ విజయలక్ష్మి, దుత్తలూరు సెంటర్‌లో బీజేపీ మండల అధ్యక్షుడు లెక్కల వెంగళరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు.

పుస్తకాల పంపిణీ

సంగం తరుణవాయి జెడ్పీఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు హెచ్‌ఎం శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఉచిత పుస్తకాలు, యూనిఫామ్‌ను సోమవారం పంపిణీ చేశారు. సంగం సాగునీటి సంఘం అధ్యక్షుడు షేక్ బాబు, టీడీపీ మండలాధ్యక్షుడు బాణా శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

శృతిమించిన టీడీపీ నాయకుడి ఆగడాలు

- ప్రతి పనికి కమీషన్ వసూలు
- పోలీసులను అడ్డుపెట్టుకుని పంచాయతీలు
- మాట వినని ఉద్యోగులపై దూషణలు
- పోరుపడలేక బదిలీ చేయించుకుని వెళ్లిన వీఆర్వో



ఇంటి వివాదంలో ఓ మహిళ సామగ్రిని ఇంటి నుంచి బయట పడేయించిన దృశ్యం (ఫైల్)



సంగం సీఐ కార్యాలయం ఎదుట ఇంటి పత్రాలు చూపుతున్న బాధిత మహిళ (ఫైల్)

చేజర్ల(ఆత్మకూరు): చేజర్ల మండలం ఆదూరుపల్లిలో టీడీపీ నాయకుడి ఆగడాలు శృతి మించాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ అధికారులను తన గుప్పిట్లో పెట్టుకుని ప్రతి పనికి కమీషన్లు వసూలు చేస్తున్నాడు. పోలీసులను అడ్డుపెట్టుకుని పంచాయతీలు నిర్వహించడం, జరిమానాలు విధించడం చేస్తున్నాడని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

- ఆదూరుపల్లిలో ప్రముఖ పుణ్యక్షేత్రం పెంచలకోనకు వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న రోడ్డు మార్జిన్ స్థలాలను కొందరు ఆక్రమించుకుని గదులు నిర్మించుకుని వ్యాపారాలు చేసుకుంటున్నారు. ఆక్రమిత స్థలాలు కావడంతో దుకాణాలకు విద్యుత్ శాఖ అధికారులు కనెక్షన్లు ఇవ్వడం లేదు. దీంతో టీడీపీ నాయకుడు రంగంలోకి దిగాడు. నలుగురు వ్యాపారులకు విద్యుత్ కనెక్షన్లు ఇప్పించేందుకు రూ.20వేలు ఇచ్చేలా ఒప్పందం చేసుకుని ఒక్కొక్కరి వద్ద రూ.5వేలు చొప్పున అడ్వాన్స్ వసూలు చేసినట్లు సమాచారం. అనంతరం విద్యుత్ శాఖ సిబ్బందిని లోబరుచుకుని విద్యుత్ కనెక్షన్లు ఇప్పించినట్లుగా తెలిసింది. దీంతో మిగిలిన వారు విద్యుత్ కనెక్షన్ కోసం ఎన్‌ఓసీ పత్రం కోసం పంచాయతీ కార్యదర్శిని కలువగా తన అనుమతిలేనిదే ఇవ్వవద్దని సదరు నాయకుడు ఆదేశించినట్లుగా సమాచారం. దీంతో వ్యాపారులు సదరు నాయకుడిని ఆశ్రయించక తప్పని పరిస్థితులు నెలకొన్నాయి.
- సచివాలయ సిబ్బందికి టీడీపీ నాయకుడి వేధింపులు తప్పడం లేదు. గ్రామంలోని ఎవరైనా సర్టిఫికెట్ల కోసం సచివాలయానికి వస్తే తనకు చెప్పకుండా ఇవ్వొద్దని హుకుం జారీ చేసినట్లుగా సమాచారం. వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు ఎవరైనా సచివాలయానికి వెళ్తే పనులు చేయకుండా అడ్డుకుంటున్నట్లుగా ఆరోపణలు ఉన్నాయి.
- ఇటీవల ఓ విషయంలో వీఆర్వోతో సైతం టీడీఈ నాయకుడు గొడవకు దిగినట్లుగా తెలిసింది. వీఆర్వోను ఇష్టారాజ్యంగా దూషించడంతో భరించలేక సమీపంలోని ఏటూరి గ్రామానికి బదిలీ చేయించుకున్నట్లుగా సమాచారం. ఇటీవల పంచాయతీ కార్యదర్శిని సైతం ఫోన్‌లో దూషించడంతో ఎంపీడీఓకు ఫిర్యాదు చేసినట్లుగా తెలిసింది.
- గ్రామంలోని పేదలైన గిరిజనులపైన కనికరం చూపని నైజం సదరు నాయకుడిది. ఇటీవల గ్రామంలోని గిరిజనకాలనీలో సిమెంటురోడ్డు నిర్మించారు. ఆ రోడ్డు నిర్మాణానికి కొందరి గిరిజనుల ఇళ్లలో కొంత భాగం తొలగించాల్సిన పరిస్థితి రావడంతో టీడీపీ నాయకుడు రంగంలోకి దిగాడు. ఓ మైనార్టీ వ్యక్తిని మధ్యస్తంగా పెట్టి గిరిజనుల ఇళ్లను తొలగించకుండా ఉండేందుకు అధికారులతో మాట్లాడుతానని ఒక్కొక్కరి వద్ద రూ.35వేలు చొప్పున వసూలు చేసినట్లుగా సమాచారం. ఆ తరువాత గిరిజనుల ఇళ్లను తొలగించకుండానే రోడ్డు వెడల్పును తగ్గించి నిర్మించేలా తన హవాను నడిపించాడంటే ఆయన దందా ఏపాటిదో తెలుస్తోంది.
- పోలీస్ స్టేషన్‌లోనూ సదరు నాయకుడు తన హవాను కొనసాగిస్తున్నారు. పోలీస్ ఉన్నతాధికారిని తన గుప్పిట్లో పెట్టుకుని తాను చెబితేనే ఫిర్యాదులు తీసుకునేలా చేశారని పేరు చెప్పేందుకు ఇష్టపడని ఓ పోలీసు పేర్కొనడం చూస్తే అతని రుబాబు తెలుస్తుంది
- గ్రామానికి చెందిన సమీప బంధువులైన ఇద్దరి మహిళల మధ్యన ఇంటి విషయంలో వివాదం నెలకొనగా ఇరువర్గాలు పోలీసులకు ఫిర్యాదులు చేసుకున్నారు. అందులో ఓ మహిళ వైఎస్సార్‌సీపీకి మద్దతుగా ఉండడంతో టీడీపీ నాయకుడు రంగంలోకి దిగాడు. ఆమెకు న్యాయం జరగకుండా మరో మహిళకు మద్దతుగా నిలిచి పోలీసులతో బెదిరింపులు చేయించాడు. ఆమె సామగ్రిని రోడ్డుపైకి విసిరేయించాడు. దీంతో బాధిత మహిళ జిల్లా ఎస్పీని ఆశ్రయించడంతో న్యాయం జరిగింది. అయితే సదరు నాయకుడు అనుమతివ్వకపోవడంతో పోలీసులు వారి వద్ద ఉన్న తాళాలను ఆరు నెలలుగా ఇవ్వలేదు. సివిల్ కేసుల్లో పోలీసుల జోక్యాన్ని ప్రశ్నిస్తూ బాధిత మహిళ మళ్లీ ఎస్పీని ఆశ్రయించడంతో ఎట్టకేలకు ఎస్సై తాళాలు ఇచ్చాడు. దీంతో సదరు నాయకుడు తాళాలు ఎందుకిచ్చావంటూ పై అధికారి ద్వారా ఎస్సైకు నోటీసు ఇప్పించినట్లుగా సమాచారం.
- గ్రామానికి చెందిన ఓ యువకుడు దాచూరు రోడ్డులో స్థలం కొనుగోలు చేసి దాబా నిర్మిస్తున్న క్రమంలో అది ప్రభుత్వ స్థలమని చోటా నాయకుడు బెదిరించి రూ.7 లక్షలు డిమాండ్ చేసినట్లుగా సమాచారం. తాను స్థలం కొనుగోలు చేసిన విషయం మంత్రికి సన్నిహితుడైన టీడీపీ నాయకుడికి కూడా తెలుసునని, ఆయనకు చెప్పే దాబా నిర్మించుకుంటున్నానని యువకుడు చెప్పగా గ్రామ నాయకుడు మరింత రెచ్చిపోయినట్లుగా సమాచారం. తన గ్రామంలో జోక్యం చేసుకోవడానికి వాడెవడంటూ నానాదుర్భాషలాడగా, సదరు యువకుడు రికార్డు చేసి మంత్రి సన్నిహితుడికి వినిపించాడు. దీంతో ఇటీవల నెల్లూరులో మంత్రి ఇంటి దగ్గర టీడీపీ నాయకుడు తారసపడిన క్రమంలో మంత్రి సన్నిహితుడు 'నీ దాష్టీకం ఎక్కువవుతోంది. కంట్రోల్‌లో ఉంటే మంచిది' అంటూ హెచ్చరించినట్లుగా సమాచారం.

ఎంపీడీఓకు సైతం బెదిరింపులు

సదరు టీడీపీ నాయకుడు ఇటీవల బదిలీపై వెళ్లిన మహిళా ఎంపీడీఓను సైతం ఫోన్‌లో బెదిరించినట్లుగా సమాచారం. గ్రామానికి చెందిన ఓ మైనార్టీ మహిళ తన భర్త పింఛన్ పొందుతూ జనవరిలో మృతి చెందాడని వితంతు పింఛన్ కోసం అర్జీ పెట్టుకుంది. ఆమె వైఎస్సార్‌సీపీ మద్దతుదారురాలనే కక్షతో సదరు నాయకుడు సచివాలయంలో అర్జీని బుట్టదాఖలు చేయించాడు. దీంతో బాధిత మహిళ పలుమార్లు ఎంపీడీఓను కలిసి తన పరిస్థితిని చెప్పుకోగా బదిలీపై వెళ్తున్న క్రమంలో పింఛన్ మంజూరు చేయించింది. ఆలస్యంగా విషయం తెలుసుకున్న చోటా నాయకుడు ఎంపీడీఓకు ఫోన్ చేసి ఇష్టారాజ్యంగా మాట్లాడినట్లుగా సమాచారం. దీంతో ఆమె జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని గట్టిగా హెచ్చరించి ఫోన్ కట్ చేసిందని సమాచారం.

జర్నలిస్టులను సైతం..

గ్రామంలో జరిగే కార్యక్రమాలకు హాజరయ్యే జర్నలిస్టులను సైతం తన మాటే వినాలని చోటా నాయకుడు బెదిరిస్తున్నట్లుగా తెలిసింది. ఇటీవల ఓ జర్నలిస్టుతో గొడవ చోటు చేసుకోగా అతను పోలీసు స్టేషన్‌లో రాతపూర్వకంగా ఫిర్యాదు చేశాడు. ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ఆ తరువాత జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసేందుకు సిద్ధమైన క్రమంలో మండల మైనార్టీ నాయకుడి సహకారంతో రాజీ చేసుకున్నట్టు సమాచారం. చోటా నాయకుడి దాష్టీకాలను ఎవరికీ చెప్పుకోలేక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మంత్రి దృష్టికి తీసుకెళ్లాలన్నా ఒకింత భయపడుతున్నట్లుగా సమాచారం. చోటానాయకుడి తీరుతో పార్టీకి సైతం చెడ్డపేరు వస్తోందని సదరు గ్రామానికి చెందిన కొందరు టీడీపీ కార్యకర్తలే పేర్కొంటుండడం గమనార్హం.

నగదు కోసం బెదిరిస్తున్నారని ఫిర్యాదు



కావలి(జలదంకి): అధికారులమని భయపెడుతూ, ఫోన్‌పే ద్వారా నగదు పంపాలని బెదిరిస్తున్నారని కావలి పట్టణ కిరాణా మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు బల్సా ప్రసాద్ ఆధ్వర్యంలో వ్యాపారస్తులు ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్లో సీఐ ఫిరోజ్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. వ్యాపారులు మాట్లాడుతూ మేము తూనికలు, కొలతలు, మున్సిపాలిటీ అధికారులం, మీరు లైసెన్స్ కట్టాలంటూ రాణా చౌదరి అనే వ్యక్తి నుంచి ఫోన్‌లు వస్తున్నాయని తెలిపారు. ఫోన్‌పే ద్వారా నగదు పంపించాలని బెదిరిస్తున్నారని, పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు తిరుపాలు, సభ్యుడు పాదర్తి నాగరాజు పాల్గొన్నారు.

ఎంఈఓ బాధ్యతల స్వీకరణ



ఎంఈఓ-1 గోవిందయ్యకు సత్కారం

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు ఎంఈఓ–1గా బీ గోవిందయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేస్తున్న బీ శ్రీధర్ ఉద్యోగ విరమణ చేశారు. దీంతో కావలి ఎంఈఓగా బాధ్యతలు నిర్వహిస్తున్న గోవిందయ్యకు అదనపు బాధ్యతలను అప్పగించారు. నూతన ఎంఈఓను కార్యాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు సన్మానించారు. ఎంఈఓ–2 మధుసూదన్‌రెడ్డి, సీఆర్పీలు జలీల్, శ్రీహరి ఎంఐసీ మౌనిత, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక రీచ్ మూసివేతకు ఒప్పుకోం

- అధికారులను అడ్డుకున్న మహిళలు



టీడీపీ జెండాలు చేతబట్టి రీచ్ దారికి అడ్డుగా నిలిచిన కాలనీ మహిళలు

ఆత్మకూరు: ఇసుక రీచ్‌ను మూసివేతకు ఒప్పుకోబోమని టీడీపీ మద్దతుదారులైన మహిళలు తెగేసి చెప్పారు. రీచ్‌ను మూసివేసేందుకు వచ్చిన అధికారులను, జేసీబీ యంత్రాన్ని వెనక్కు పంపిన ఘటన సోమవారం సాయంత్రం ఆత్మకూరు మండలం అప్పారావుపాళెం ఇసుక రీచ్ వద్ద జరిగింది. వివరాలిలా ఉన్నాయి. ప్రభుత్వం జూన్ 1 నుంచి ఆగస్టు నెలాఖరు వరకు ఇసుక రీచ్‌లను నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేసినా అప్పారావుపాళెంలోని పెన్నా ఇసుక రీచ్ కొనసాగుతున్న విషయం తెలిసిందే. స్థానిక టీడీపీ నాయకుల అండతో రీచ్ కొనసాగుతున్న వైనంపై పత్రికల్లో కథనాలు వచ్చాయి. దీంతో స్పందించిన ఆర్డీఓ బీ పావని ఆదేశాలతో తహసీల్దార్ పద్మజా కుమారి రీచ్‌ను నిలిపివేయాలని రెవెన్యూ సిబ్బంది, పోలీసు అధికారులను సోమవారం పంపారు. అయితే స్థానిక దళిత కాలనీకి చెందిన టీడీపీ మద్దతుదారులైన మహిళలు అధికారులను అడ్డుకున్నారు. ఎట్టి పరిస్థితిలోనూ రీచ్ మూసేందుకు ఒప్పుకోబోమని తేల్చి చెప్పారు. ఓ దశలో అధికారులకు, వారికి మధ్య వాగ్వాదం జరిగింది. తీవ్ర ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. టీడీపీ జెండాలు చేతబట్టిన మహిళలు రీచ్‌లోకి అధికారులను, దారికి గండి కొట్టేందుకు వెళ్తున్న జేసీబీని అడ్డుకుని వెనక్కు పంపేశారు. మహిళలు మాట్లాడుతూ రీచ్‌ని మూసివేసేందుకు అధికారులకు అనుమతి లేదన్నారు. మా గ్రామంలోని రీచ్ మా ఇష్ట ప్రకారమే జరగాలన్నారు.

షాపుల అక్రమాలపై విచారణ చేపట్టాలి



నిరసన తెలుపుతున్న ఎస్ మల్లి

కావలి (జలదంకి) : కావలి ఏరియా వైద్యశాల షాపింగ్ కాంప్లెక్స్‌కు సంబంధించిన అక్రమాలపై విచారణ చేపట్టడంతో పాటు లీజుదారుల నుంచి అద్దె బకాయిలను వసూలు చేయాలని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్ మల్లి కోరారు. ఈ మేరకు కావలి ఆర్డీఓ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన తెలిపి ఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు. కావలి ఏరియా వైద్యశాలకు సంబంధించిన షాపింగ్ కాంప్లెక్స్‌లో 25 షాపులు ఉన్నాయని తెలిపారు. ఒక్కో షాపును రూ.5 వేల నుంచి లీజుకు తీసుకుని అద్దెలు చెల్లించకుండా భారీ మొత్తంలో బకాయిలు ఉన్నారని తెలిపారు. కొందరు షాపుల రూపురేఖలను సైతం మార్చి ఒకదానిని మూడుగా చేసి ఇతరులకు సబ్‌లీజుకు ఇచ్చి నెలకు రూ.25వేలు చొప్పున వసూలు చేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారన్నారు. ప్రస్తుతం షాపులను నిర్వహిస్తున్న వారిలో అసలు లీజుదారులు ఒక్కరూ కూడా లేరన్నారు. సమగ్ర విచారణ చేపట్టి నిబంధనలను అతిక్రమించిన వారి లీజును రద్దు చేయాలని కోరారు. నాయకులు జడ్డా వాసు, విజయరత్నం, నరసింహారావు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల ఆందోళన



జలదంకిలో నిరసన తెలుపుతున్న సర్వేయర్లు



వింజమూరులో..

వింజమూరు(ఉదయగిరి): తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వింజమూరు మండలంలోని గ్రామ సచివాలయాల ఉద్యోగులు మండల పరిషత్ కార్యాలయం ఎదుట సోమవారం ఆందోళన చేశారు. అనంతరం ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, సీనియర్ అసిస్టెంట్ పేస్కేల్ వర్తింపజేయాలని, అర్హత కలిగిన వారికి ప్రమోషన్లు, స్పష్టమైన జాబ్‌చార్టును ఇవ్వాలని కోరారు. వెబ్‌కౌన్సెలింగ్ ద్వారా పారదర్శకంగా బదిలీలు చేపట్టాలని, హేతు బద్దీకరణ తర్వాత మిగిలిపోయిన ఉద్యోగుల భవిష్యత్‌పై స్పష్టత ఇవ్వాలని, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

జలదంకి: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండలంలోని గ్రామసచివాలయ సర్వేయర్లు మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ ప్రమీలకు వినతిపత్రం అందజేశారు. గ్రామ సర్వేయర్లు శ్రీహరిబాబు, వినయ్‌కుమార్, నాగరాజు, యలమందరావు, ప్రగతి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

గ్రావెల్ అక్రమ తరలింపుపై ఫిర్యాదు



దగదర్తి: మండలంలోని అనంతవరం గ్రామం నుంచి గ్రావెల్‌ను అక్రమంగా రాత్రి వేళల్లో టిప్పర్ల ద్వారా తరలిస్తున్నారని, అధికారులు స్పందించి వెంటనే నిలిపివేయాలని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు సీపీఎం నాయకులతో కలిసి మండల తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ పీ కృష్ణకు సోమవారం ఫిర్యాదు చేశారు. కొందరు భూములను చదును చేసుకుంటున్నామని చెబుతూ గ్రావెల్‌ను తరలిస్తున్నారని విన్నవించారు.గ్రావెల్‌ను తరలించే టిప్పర్ల కారణంగా జాతీయ రహదారి నుంచి గ్రామానికి ఉన్న బీటీ రోడ్డు దెబ్బతింటోందన్నారు. అనంతవరం చెరువు కలుజు నీరు వెళ్లే వంతెన సైతం కూలిపోయేలా ఉందన్నారు. సీపీఎం నాయకులు గోపసాని రమేష్, వంటేరు సుధాకర్, పెరికల మాల్యాద్రి పాల్గొన్నారు.

పారిశుధ్యం, తాగునీటిపై ప్రత్యేక దృష్టి

ఉదయగిరి: మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యం, తాగునీటి సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని ఎంపీడీఓ అప్పాజీ పంచాయతీకార్యదర్శులకు సూచించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. గ్రీన్‌అంబాసిడర్లు ప్రతిఇంటి నుంచి తడిపొడి చెత్తను సేకరించి సంపద తయారీ కేంద్రానికి తరలించేలా చూడాలన్నారు. పారిశుధ్యం, తాగునీటి సమస్యలపై ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మండలంలోని 12 గ్రామ సచివాలయాల్లో పనిచేస్తూ ఐదేళ్ల సర్వీసును పూర్తి చేసుకున్న సిబ్బంది సొంత మండలాలకు కాకుండా ఇతర మండలాలకు బదిలీల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

26 నుంచి ఉచిత నట్టల నివారణ

ఉదయగిరి రూరల్: మండలంలోని గండిపాళెం పశువైద్యశాల పరిధిలో ఈ నెల 26 నుంచి జూలై 7వ తేదీ వరకు ఉచిత నట్టల నివారణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పశువైద్యాధికారి ఎస్వీఎస్ రాఘవేంద్రశర్మ సోమవారం తెలిపారు. పశువైద్యశాల పరిధిలో 35 వేల జీవాలు ఉన్నాయని చెప్పారు. జీవాల పోషకులు ఉచిత నట్టల నివారణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని తమ జీవాలతో నట్టల నివారణ మందు తాగించాలని కోరారు.

సొసైటీలో సీఎస్‌సీ ప్రారంభం

దుత్తలూరు: మండలంలోని కమ్మవారిపాళెం సహకార సంఘంలో కామన్ సర్వీస్ సెంటర్ సేవలను ప్రారంభించినట్లు సీఈఓ లోకనాథ్‌రెడ్డి సోమవారం తెలిపారు. డిజిటల్ సేవలో భాగంగా పాన్‌కార్డ్, ఆధార్‌కార్డు, ఆర్టీఓ, పాస్‌పోర్టు సేవలతో పాటు కరెంటు బిల్లులు, ఇంటి పన్నులు, ఎల్ఐసీ, వాహన బీమా చెల్లింపు సేవలను అందిస్తున్నామని వివరించారు. రైతులు చెల్లించే రుణాలకు స్పష్టమైన వివరాలతో కూడిన డిజిటల్ రశీదులను అందజేస్తున్నట్లు చెప్పారు. సొసైటీకి సంబంధించిన రికార్డులు, లావాదేవీలను డిజిటల్ చేసినట్లు తెలిపారు.

26న మండల సర్వసభ్య సమావేశం

జలదంకి: ఈ నెల 26న మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బ్రహ్మయ్య సోమవారం తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ జీ వెంకటరమణయ్య అధ్యక్షతన జరిగే సమావేశానికి మండలాధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరుకావాలని కోరారు.

చేజర్ల మండల సర్వసభ్య సమావేశం రేపు

చేజర్ల(ఆత్మకూరు) : చేజర్ల మండల సర్వసభ్య సమావేశాన్ని బుధవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వసుంధరదేవి సోమవారం తెలిపారు. ఎంపీపీ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు జరిగే సమావేశానికి మండలాధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరుకావాలని కోరారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థుల ఎంపిక



ఆఫ్రీన్ తాజ్



ఎం లహరి

చేజర్ల(ఆత్మకూరు): చేజర్ల మండలంలో పదోతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన పలువురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. చేజర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన జీ పుష్ప, షేక్ యాస్మిన్, నాగులవెలటూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన వీ సాత్విక, పిడికిటి వెంకటకావ్య, సీహెచ్ చిన్నప్రియ, తూర్పుపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన బీ దివ్యశ్రీ, జ్యోత్స్న, రేష్మా, మాముడూరు జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పీ చందనలక్ష్మి, చేజర్లలోని లుంబిని విద్యాలయానికి చెందిన షేక్ ఆఫ్రీన్‌తాజ్, మెంటా లహరి ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారు. వారిని ఎంఈఓ, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు అభినందించారు.

దొంగతనాల నియంత్రణకు ప్రత్యేక నిఘా



మాట్లాడుతున్న సీఐ పాపారావు

అల్లూరు: మండలంలో వరుసగా దొంగతనాలు జరుగుతున్న నేపథ్యంలో అరికట్టేందుకు ప్రత్యేక నిఘా ఉంచినట్లు కావలి రూరల్ సీఐ పాపారావు తెలిపారు. సోమవారం ఆయన అల్లూరు పోలీసుస్టేషన్‌ను సందర్శించారు. ఇటీవల జరిగిన దొంగతనాలపై ఆరా తీశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. త్వరలోనే చోరీ కేసులను ఛేదించి దొంగలను పట్టుకుంటామని తెలిపారు. రాత్రి వేళ ప్రత్యేక పోలీసు బృందాలతో గస్తీని పెంచుతామన్నారు. నేరాల కట్టడికి ప్రజలు తమ వంతు సహకారాన్ని అందించాలని కోరారు. అనుమానాస్పద వ్యక్తులు తారసపడితే వెంటనే తమకు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. ఇళ్లకు తాళాలు వేసి ఊర్లకు వెళ్లే వారు పోలీసుస్టేషన్‌లో సమాచారం అందజేస్తే లాక్డ్‌హౌస్ మానిటరింగ్ సిస్టమ్ ద్వారా ఇంటిపై నిఘా ఉంచుతామని తెలిపారు. ఆయన వెంట ఎస్సై శ్రీనివాసరెడ్డి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ఆగస్టులో అలఘునాథుని పుష్కర మహాకుంభాభిషేకం



ఆత్మకూరు: పట్టణంలోని పురాతన శ్రీదేవి, భూదేవి సమేత అలఘునాథస్వామి ఆలయాన్ని పునర్నిర్మించి పుష్కరకాలం పూర్తయిన సందర్భంగా ఆగస్టులో పుష్కర మహాకుంభాభిషేక మహోత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు అలఘునాథస్వామి ఆలయ ప్రాంగణంలో కమిటీ సభ్యుల సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆగస్టు 5, 6, 7 తేదీల్లో పుష్కర మహాకుంభాభిషేక మహోత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. చివరిరోజు అలఘునాథస్వామి కల్యాణోత్సవం, భారీ స్థాయిలో అన్నప్రసాద వితరణ, రాత్రికి గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు వివరించారు. పుష్కర కుంభాభిషేక మహోత్సవాలను విజయవంతం చేసేందుకు భక్తులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ పెద్దలు పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలోని ఏఎస్‌పేట అడ్డరోడ్డు వద్ద ముంబై జాతీయ రహదారిపై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. సీహెచ్ కొండయ్య అనే వ్యక్తి నెల్లూరు నుంచి ఆత్మకూరు మండలం బట్టేపాడు గ్రామానికి మోటార్‌సైకిల్‌పై వెళ్తున్నాడు. ఇటీవల ఏఎస్‌పేట అడ్డరోడ్డు సమీపంలో రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్న క్రమంలో వాహనాల వేగాన్ని తగ్గించేందుకు పోలీసులు బారికేడ్లను ఏర్పాటు చేశారు. వాటిలో కొన్నింటికి రేడియం స్టిక్కర్లు లేక కనిపించకపోవడంతో కొండయ్య వాటిని ఢీకొని కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడ్ని 108 వాహనంలో ఆత్మకూరు ప్రభుత్వ జిల్లా వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గేదెను ఢీకొని ఆటో బోల్తా

జలదంకి: కావలి మండలం బుడంగుంట ఇందిరమ్మ కాలనీ సమీపంలో జాతీయ రహదారిపై సోమవారం సాయంత్రం అడ్డొచ్చిన గేదెలను ఢీకొని ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఒక గేదె మృతి చెందగా, ఆటోలో ప్రయాణిస్తున్న ఆరుగురిలో ఒకరు గాయపడ్డారు. క్షతగాత్రుడ్ని చికిత్స నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. ఆటో జలదంకి మండలం సోమవరప్పాడుకు చెందిన రాజా అనే వ్యక్తికి చెందినదిగా తెలుస్తోంది.

విద్యార్థులకు విద్యాసామగ్రి వితరణ



విద్యార్థులకు నోట్ పుస్తకాలను అందజేస్తున్న దృశ్యం

కొండాపురం : మండలంలోని సత్యవోలు, అగ్రహారం, లింగన్నపాళెం, పెరికిపాళెం గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 80మంది విద్యార్థులకు ఎస్ఆర్‌కే ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గద్దె రామకృష్ణ విద్యాసామగ్రి వితరణ చేశారు. సోమవారం తన ట్రస్టు సభ్యుల ద్వారా నోట్ పుస్తకాలు, పలకలు, పెన్నులు, తదితర సామగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఎంఈఓ రవికుమార్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఎస్ఆర్ఐ గద్దె రామకృష్ణ ప్రభుత్వ పాఠశాలల్లోని పేద విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని విద్యాసామగ్రిని వితరణ చేయడం అభినందనీయమన్నారు. ఉపాధ్యాయులు కొండూరి భీమేశ్వరరావు, దేగా మహేష్, సునంద, చెంచురామయ్య, ట్రస్టు సభ్యులు మందపల్లి మాధవరావు, భాస్కర్, వేణు తదితరులు పాల్గొన్నారు.